క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పొన్నూరు పట్టణంలోని షరాఫ్ బజార్ ప్రాంతానికి చెందిన పఠాన్ అమీన్ ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలుదేరాడు. మార్గ మధ్యలో నారాకోడూరు సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఓ ముఖానికి, నడుంకు గాయాలైన అమీన్‌ను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



పొన్నూరు: మండలంలోని పచ్చలతాడిపర్రులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ, కసుకర్రు గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, వేద పండితుల ఆశీర్వచనం పొందారు.

స్వచ్ఛంద సంస్థలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


గుంటూరు రూరల్: ప్రతి రాష్ట్రంలోనూ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సంస్థల కోసం ఒక ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా కొన్ని నిధులను కేటాయించాలని భారత స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మునిపల్లి సంపత్‌కుమార్ కోరారు. ఆదివారం బొంతపాడులోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. సమాజ సేవ చేస్తూ వృద్ధాప్యరీత్యా పేదరికంతో జీవిస్తున్న ప్రతి సమాజసేవకునికి ప్రత్యేక పెన్షన్ కల్పించాలని కోరారు. సేవా సంస్థల సేవలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణంలో తీసుకొని వారికి తగినటువంటి న్యాయం చేయాలని, రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి చట్టపరంగా రూపకల్పన చేస్తారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు.

సెయింట్ ఆన్స్‌లో వీడ్కోలు వేడుకలు



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నతికి తమ కళాశాల కృషి చేస్తోందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. ఆదివారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఫార్మల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమారాణి మాట్లాడుతూ విద్యార్థులు విలువలను పెంపొందించుకుని తల్లిదండ్రులను, చదువు చెప్పిన గురువులను మరవరాదన్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో భాగంగా మిస్ సెయింట్ ఆన్స్ పోటీలను నిర్వహించి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు గురులక్ష్మి, నిఖిత, దివ్యలకు బహుమతులు అందజేశారు.

అలరించిన పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శన




నగరంపాలెం: స్థానిక కృష్ణతులసినగర్ ఒకటో వీధిలోని అభయాంజనేయ కళా ప్రాంగణంలో ఆదివారం రామాంజనేయ యుద్ధంలోని యుద్ధ ఘట్టం పద్యనాటక ప్రదర్శన నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి(విజయవాడ) సౌజన్యంతో శ్రీకరుణామయి బాలఏసు నాట్యమండలి ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రీరామునిగా జి.శ్రీనివాసరావు, శ్రీఆంజనేయునిగా బ్రహ్మం నటించారు. అనంతరం సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం జరగ్గా, విశ్వామిత్రునిగా షేక్ మీరావలి(తక్కెళ్లపాడు), హరిశ్చంద్రుడుగా కేవీ రమణ, వివేకానందస్వామి, గుర్రాల వెంకటేశ్వరావు, తుళ్లూరు వెంకయ్యస్వామి, నక్షత్రకునిగా పరదేశి, వెంకటేశ్వర్లు, చంద్రమతిగా ఎం.లక్ష్మీశ్రీ పలువురు వివిధ పాత్రల్లో నటించి అలరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోవూరు లక్ష్మి, టీడీపీ డివిజన్ అధ్యక్షులు బూరి సురేష్ పాల్గొన్నారు.

వినికిడి సమస్య.. జరభద్రం

నేడు వరల్డ్ హియరింగ్ డే

- పెరుగుతున్న వినికిడి సమస్యలు
- ఆధునిక జీవన శైలితో సమస్య తీవ్రతరం
- ముందస్తుగా వినికిడి సమస్యను గుర్తించవచ్చు
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల యువత వినికిడి సమస్య బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పది మందిలో ముగ్గురికి వినికిడి సమస్య వస్తోంది. వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నివారించవచ్చు. వినికిడి సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా మార్చి 3వ తేదీని వరల్డ్ హియరింగ్‌డే నిర్వహిస్తున్నారు.

వినికిడి లోపం కారణాలు

పుట్టుకతో వినికిడి శక్తి లోపానికి ప్రధాన కారణం జన్యుపరమైనవే. పుట్టుకతో 70 శాతం వినికిడి లోపం మేనరికపు వివాహాల వల్ల వస్తుంది. వినికిడిలోపం రావడానికి నవజాత శిశువుగా ఉన్నప్పుడు కామెర్ల వ్యాధి సోకడం, ఆక్సిజన్ లోపం వలన వస్తుంది. గర్భంలో బిడ్డ ఉన్నప్పుడు తల్లి సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, గర్భిణికి ఏమైనా ఇన్‌ఫెక్షన్లు సోకడం వల్ల పుట్టబోయే బిడ్డకు వినికిడి సమస్య వస్తుంది. వృద్ధాప్యం వల్ల సర్వసాధారణంగా వినిడి లోపం వస్తుంది. కొన్నిరకాల మందులు వాడడం వల్ల కూడా వినికిడి లోపం వస్తుంది. సుమారు 200 రకాల ఔషధాలు వినికిడి శక్తిని తగ్గిస్తాయని పరిశోధనలో తేలింది. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులకు వాడే మందులు వినికిడి శక్తిని తగ్గిస్తాయి. తలకు, లేదా చెవికి బలమైన దెబ్బ తలగడం వల్ల చెవి మధ్యలో ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల వినికిడి సమస్య వస్తుంది.

జిల్లాలో బాధితులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది ఆడియాలజిస్టులు ఉన్నారు. వారంలో ఒక్కో ఆడియాలజిస్టు 5 నుండి 10 మంది పిల్లలకు చెవుడు, మూగ సమస్యకు చికిత్స అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడువేల మంది పిల్లలు వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ నివేదిక వెల్లడిస్తుంది.

నిర్ధారణ పరీక్షలు

వినికిడి శక్తి పరీక్షలను ఆడియాలజీ సెంటర్‌లలో చేస్తారు. బిడ్డపుట్టిన 24 గంటల నుంచే వినికిడి పరీక్షలు చేయవచ్చు. బిడ్డపుట్టిన పదిరోజుల్లోపు తప్పనిసరిగా తల్లిదండ్రులు వినికిడి పరీక్ష చేయించాలి. ఈ పరీక్షను ఓ.ఏ.టూ పరీక్ష అంటారు. ఇది స్క్రీనింగ్ పరీక్ష మాత్రమే. బిడ్డపుట్టిన మూడో నెలలో బెరా పరీక్ష చేసి వినికిడి శక్తి స్థాయిని నిర్ధారిస్తారు. ఏడు సంవత్సరాలు ఆపై వయస్సు ఉన్నవారికి పీటీఏ పరీక్ష చేసి వినికిడి సామర్థ్యాన్ని నిర్ధారిస్తారు. పది నుంచి 15 డెసిబుల్స్ ఉంటే హియరింగ్ నార్మల్‌గా ఉన్నట్లు లెక్క. అంతకు మించి తక్కువ ఉంటే వినికిడి సమస్య ఉన్నట్లుగా నిర్ధారిస్తారు.

వినికిడి లోపం వలన కలిగే ఇతర సమస్యలు

పుట్టుకతో వినికిడి లోపం వస్తే చిన్నారులు భాష నేర్చుకోలేక, మూగ, చెవిటివారిగా మారిపోతారు. మాటలువచ్చిన 12 ఏళ్లలోపు పిల్లలకు ఏదైన కారణాల వల్ల వినికిడి లోపం వస్తే మాట స్పష్టత తగ్గిపోతుంది. నలుగురిలో ధైర్యంగా మాట్లాడలేరు. వినికిడి లోపం వల్ల మానసిక రుగ్మతలు సైతం పెరుగుతాయి. అల్జీమర్స్ వ్యాధి సైతం సోకుతోంది. కుంగుబాటుకు గురవుతారు.

దేశంలోనే మొదటిసారిగా...

పుట్టుకతోనే చెవుడు సమస్య ఉన్న పిల్లలకు కాక్లియర్ ఆపరేషన్లు చేయించటం ద్వారా వినబడేలా చేయవచ్చని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకంలో కాక్లియర్ ఆపరేషన్లు చేర్చటంతో సుమారు ఎనిమిది లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండు చెవులకు కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేసే విధంగా ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు.

నివారణ చర్యలు



మేనరికపు వివాహాల వల్ల వినికిడి సమస్యలు పుట్టే బిడ్డలకు వస్తాయి కాబట్టి ఆ వివాహాలకు దూరంగా ఉండాలి. శిశువు దశలో వచ్చే ఇన్‌ఫెక్షన్‌లు సోకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిమితికి మించి శబ్దాలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. వినిడి శక్తిని తగ్గించే ఔషధాలపై అవగాహన కలిగి ఉండాలి. చెవి ఇన్‌ఫెక్షన్‌లను త్వరితగతిన తగ్గించుకునేలా వైద్యులను సంప్రదించాలి.

– టంగుటూరి నరేంద్ర,
ఆడియాలజిస్టు అండ్ స్పీచ్ థెరపిస్ట్, గుంటూరు

ఉచితంగా ఆపరేషన్‌లు...



పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న పిల్లలకు మూడు నుంచి ఐదేళ్లలోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేస్తే ఫలితం ఉంటుంది. పుట్టిన వెంటనే బిడ్డకు వినికిడి సమస్యలు తెలుసుకునేందుకు తప్పనిసరిగా పరీక్షలు చేయించటం చాలా మంచిది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం భాగంగా సైతం ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు చేస్తున్నారు.

– డాక్టర్ పీవీ సంపత్‌కుమార్,
కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్, గుంటూరు

9 నుంచి రామ పారాయణ మహా యజ్ఞం పూర్ణాహుతి

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం జరగనుంది. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఆరురోజులపాటు జరిగే ఈవేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. 2022 డిసెంబరు 25న ప్రారంభించిన అష్టోత్తర శతకోటి (108) శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞంలో రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల్లోని భక్తులు పాల్గొన్నారు. పారాయణ పూర్తయిన నేపథ్యంలో కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ ప్రాంగణంలో వైఖానసాగమోక్తంగా పూర్ణాహుతి మహాయజ్ఞం తలపెట్టినట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈనెల తొమ్మిదో తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు విశేష హోమాలు, కళ్యాణాలు, ఉచిత సామూహిక పూజలు, ఆధ్యాత్మికవేత్తల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో భగవత్ రామానుజ దాసుడు సహకారంతో ఎంతో వైభవంగా జరిగే అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ పూర్ణాహుతి మహోత్సవంలో భక్తజనావళి విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, సభ్యులు జంజం రామారావు, ఉప్పల వరదరాజులు, మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, రొంపిచర్ల సురేష్, గుంటి వెంకట్, శ్రీరామ్ రాజేష్ బాబు, మాజేటి వెంకటేష్, కోట బద్రి నారాయణ, గోలి సోమశేఖర్, కే రాజశేఖర్, కె హరీష్ తదితరులు పాల్గొన్నారు

నూరు శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను నూరు శాతం వసూలు చేయాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులకు ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మార్చి నెల ప్రారంభమైన దృష్ట్యా రెవెన్యూ విభాగ ప్రతి అధికారి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పన్ను బకాయి ఉన్న ప్రైవేట్ ఆస్తుల్లో రూ.165 కోట్లకు ఇప్పటి వరకు రూ.90 కోట్లు వసూలు జరిగిందని, మార్చి చివరికి మరో రూ.50 కోట్లు వసూలు చేయాలన్నారు. పన్ను వసూళ్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారి, డెప్యూటీ కమిషనర్ల వారీగా రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకు తగిన విధంగా క్షేత్ర స్థాయిలో వసూలు జరగాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వాటికి డెప్యూటీ కమిషనర్లు బాధ్యత తీసుకోవాలని, పన్ను వసూలు అధిక ప్రాధాన్యం అయినందున విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి చార్జీలను సకాలంలో చెల్లించాలని, తద్వారా నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు వీలు కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2024–25 రెండవ అర్ధ సంవత్సరం చివరికి వచ్చామని, నెలాఖరు వరకు వేచి ఉండకుండా నగరపాలక సంస్థకు బకాయిలు మొత్తం చెల్లించాలని, ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై నెలకు రూ.100 రూ.2 వడ్డీ చొప్పున జమ అవుతుందన్నారు. మార్చి నెలలో సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని, పన్నులను జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140 సచివాలయంలోని క్యాష్ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు.

మర్యాదపూర్వక కలయిక...



అంబటిని కలిసిన వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నేతలు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుని పార్టీ అనుబంధ విభాగాల నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పలువురు ఆయనను మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. సిద్ధార్థ నగర్‌లోని ఆయన కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పదవి తీసుకున్న ప్రతి ఒక్కరూ బాధ్యతతో పార్టీ పటిష్టతే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అధిష్టానం ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరి భుజాలపై ఉందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికి వెనుకాడని ఘన చరిత్ర వైఎస్సార్ సీపీకి ఉందని పేర్కొన్నారు. అంబటిని కలిసిన వారిలో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వాసి మల్ల విజయ్, పంచాయతీ రాజ్ విభాగ జిల్లా అధ్యక్షులు దాసరి రాజు పాల్గొన్నారు.

వైభవంగా శేష వాహనంపై శ్రీవారి నగరోత్సవం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం రెండో రోజుకి చేరాయి. మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ నిర్వహించారు. విష్వక్సేనారాధన, పుణ్యావచనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభారాధన, సుదర్శన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠ ప్రధాన హోమం వంటి పూజా కార్యక్రమాలను టీటీడీ ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై ఉభయదేవి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, నామ సంకీర్తన బృందాలు, విద్యుత్ దీప కాంతుల నడుమ ప్రధాన వీధుల్లో ఊరేగింపు కొనసాగింది. త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి(భీమవరం) భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మంత్రాధినులైన దేవతలను ఆవహించి, విశేష కుంభపూజ నిర్వహిస్తారని అ న్నారు. ప్రముఖ సాహితీవేత్త మల్లాది కై లాసనాథ్ బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేక విశిష్టతను తెలిపా రు. ఎమ్మెల్యే గల్లా మాధవి, వీవీఐటీ విద్యా సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రసంగించారు. అతిథులను ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు సత్కరించారు. కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్ట ప్రభాకరరావు, సూర్యదేవర వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వ్యాఖ్యత బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి మహాకుంభాభిషేకం విశేషాలను వివరించారు.



పూజా కార్యక్రమంలో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి(భీమవరం), ఎమ్మెల్యే గల్లా మాధవి

13 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో ఒకటో లైన్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట శిబిరంపై వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ ఆదివారం దాడులు నిర్వహించి 13 మందిని అదుపులో తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజేంద్రనగర్1వ లైన్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో గత కొంత కాలంగా పేకాటాడుతున్నట్లు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీకి వచ్చిన సమాచారం మేరకు పట్టాభిపురం సీఐ, ఎస్సై సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో 13 మందిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద ఉన్న రూ.54,100, సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైన అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే గంజాయి, మత్తు పదార్థాలు విక్రయాలు జరుగుతున్నట్లు అయితే తమకు సమాచారం తెలియజేయాల్సిందిగా సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి వంటి మత్తు పదార్థాలను తాగి స్థానికులతో అసభ్యకరంగా వ్యవహరించిన సహించేది లేదని చట్ట పరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయన్నారు.

ఇచ్చిన మాటలకు పొంతనలేని బడ్జెట్

ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ రైతులకు మేలు చేసేలా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ధాన్యం, మిర్చి, కంది, శనగ పంటలకు ధరలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇలాంటి నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు సంబంధించి రూ.3 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.300 కోట్లు విదల్చటం ఏం సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని చెప్పి, ఇప్పుడు కేంద్రంతో కలిపి ఇస్తామనడం రైతాంగాన్ని మోసగించటం కాదా? అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాలని కోరారు. పంట రుణాలు, పరిహారం, పంటల బీమాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

12న మహా ధర్నాను విజయవంతం చేయండి

దుగ్గిరాల: ఈ నెల 12న జరగనున్న మహా ధర్నా కరపత్రాలను ఆదివారం సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. దుగ్గిరాలలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు కల్పించాలని, వేతనం పెంచాలని విజయవాడలో చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోతున్నాయన్నారు. ఆప్కాస్ విధానాన్ని తొలగించి కార్మికులను కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద, మార్చి 6న విజయవాడలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, నాయకులు రాచకొండ శివ, హరిబాబు, మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వశాంతిని కాంక్షించాలి

విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ



క్షీరాభిషేకం చేస్తున్న విశ్వంజీ

చినకోండ్రుపాడు(ప్రత్తిపాడు): పంచభూతాలను శాంతింపజేసి విశ్వశాంతిని కాంక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ అన్నారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు విశ్వనగర్‌లో విశ్వంజీ జన్మదిన వేడుకలు రెండవ రోజైన ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. ధర్మపురి వేదపండితులు బొజ్జా రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశ్వనగర్ ఆవరణలో కొలువుదీరిన విశ్వకుండలిని శ్రీనివాస సుబ్రహ్మణ్య స్వామికి 108 కలశాలతో విశేష అభిషేకాలను వేదమంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. హారతి అనంతరం మహానైవేద్యాన్ని సమర్పించారు. స్థానిక యాగశాలలో వేదపండితులు శ్రీలక్ష్మీ గణపతి, అరుణ, శ్రీ మహాసౌర, శ్రీ నారాయణ, చండీ పారాయణము, చతుర్వేద హవనములు, జ్యోతిర్లింగాచర్చన, రుద్రాభిషేకాలు చేశారు. విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వంజీ ఆశీస్సులు అందుకున్నారు. సాయంత్రం జరిగిన కోలాట ప్రదర్శన ఆహుతులను అలరించింది.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న గేరా మోహనరావు

కాకుమాను: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పుస్తక పఠనం మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులలో సమర్థంగా చదివే అలవాటును పెంపొందించడానికి ప్రతి ఆదివారం శాఖా గ్రంథాలయంలో చదవడం అంటే మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. గ్రంథాలయాల్లో లభించే నీతి కథలు, కథనాలు, నీతి పద్యాలు వంటి పుస్తకాలు చదవడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, గారపాటి రమేష్, వెలినేని శివయ్య, మల్లిక, మంజుల పాల్గొన్నారు.

ఊపిరితిత్తులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ రఘు



లక్ష్మీపురం: ఊపిరితిత్తులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ ఎస్.రఘు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తులు ఆరోగ్యంగా లేని సందర్భాల్లో శరీరంలో అవయవాలకు సరైన ఆక్సిజన్ అందక మిగిలిన అవయవాలు కూడా దెబ్బతిని రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ధూమపానం, మద్యపానం వలన ఊపిరితిత్తులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఇటీవల కాలంలో పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కూడా ఈ అనారోగ్యానికి ముఖ్య కారణాలలో ఒకటిగా కనిపిస్తోందని చెప్పారు. ఇంటి నుంచి బయటికి వచ్చినప్పుడు మాస్క్ ధరిస్తే చాలా ఉత్తమమని సూచించారు. గాలి ద్వారా వచ్చే సల్ఫర్, దూమ్ము, ధూళి ఇతర క్యాన్సర్ కారకాలు శ్వాస నాళాల ద్వారా లోనికి ప్రవేశించి ఊపిరితిత్తులను అనారోగ్యానికి గురి చేస్తున్నాయని కావున మనం తీసుకునే గాలి పరిశుభ్రంగా, ఎక్కువ ఆక్సిజన్ ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. టీబీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని, అప్రమత్తంగా ఉండి సరైన వైద్యాన్ని తీసుకుంటే నయమైపోతుందని చెప్పారు. ఈ వ్యాధికి ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు, వైద్య పరీక్షలు, పోషకాహారం కొరకు నగదును కూడా పొందవచ్చని వివరించారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మిన ఆ తుంపర్ల ద్వారా కూడా ఇతరులకు సోకుతుందని వివరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు, అవగాహన సీనియర్ సభ్యులు ఎస్.సాంబశివరావు, పాముల రెడ్డి, ఆర్.రామచంద్రరావులు పాల్గొని ప్రసంగించారు.